క్లుప్తంగా

పక్కాగా పారిశుధ్య నిర్వహణ



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచనలిస్తున్న జోన్‌-5 కమిషనర్ కృష్ణ

మద్రిపాలెం: పారిశుధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని సిబ్బందిని జీవీఎంసీ జోన్‌-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. 50వ వార్డు బిర్లా జంక్షన్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్ పరిధిలోని వార్డుల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ విధిగా నిర్వహించాలన్నారు. రోడ్లపై చెత్తకుప్పలు ఉండకూడదని, అన్ని దుకాణాల వద్ద చెత్త బుట్టలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు ప్రతి రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్సీ అన్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహత్ కాలనీలో బోరు ఏర్పాటు



బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మహత్ కాలనీలో రూ.1.50 లక్షల జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన బోరును బుధవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి సమస్య నియంత్రణలో భాగంగానే బోరు ఏర్పాటు చేశామన్నారు. స్థానికులు వేసవిలో నీటిని వృథా చేయరాదని కోరారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, పైడి ప్రతాప్, కె.శ్యామ్, పి.లక్ష్మణ్, డి.రాణి, బి.రమణ, జై భీమ్ సేవా సంఘం సభ్యులు, ఆది ఆంధ్రా సేవా సంఘం సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ రాజేంద్ర

కంచరపాలెం: ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డీటీసీవో అండ్ డీఎంటీవో ఆదేశాల మేరకు బుధవారం కప్పరాడ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ సనపల రాజేంద్ర, డాక్టర్ హర్షిమ పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో టీబీ సిబ్బంది ఎస్.పైడిరాజు, వైద్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాహిత్య గోష్టి



మాట్లాడుతున్న డాక్టర్ వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సాహిత్య గోష్టి కార్యక్రమం అలరించింది. సభాధ్యక్షుడు డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ సాహిత్యం, సాహితీ సమావేశాలు మన భాష, సంస్కృతులను సమాజానికి పరిచయం చేసి తెలుగు భాష ఉన్నతికి కృషి చేస్తాయన్నారు. ఈ గోష్టిలో కె.వి.ఎస్.మూర్తి, కాశీపట్నం రామారావు రచించిన జీవధార, విజయచంద్ర గూడు కవితపై కె.జి.వేణు వ్యాఖ్యానం, వేదుల సత్యనారాయణమూర్తి పద్యధారపై సిహెచ్.చినసూర్యనారాయణ, ఆదూరి సీతారామమూర్తి కథా సంపుటిపై బి.రాధారాణి, విశాఖ తెలుగు కథ గురించి డి.వి.సూర్యారావు ప్రసంగించారు. పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పార్కుల్లో వేసవి సందడి

- కళకళలాడుతున్న 50, 51, 53 వార్డుల్లోని ఉద్యానవనాలు
- ఆటపాటలతో జాలీగా గడుపుతున్న చిన్నారులు



50వ వార్డు బృందావన్ పార్కులో షటిల్ ఆడుతున్న బాలలు



53వ వార్డు ఎఫ్‌సీఐ పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

మద్రిపాలెం: వేసవి కాలం వచ్చిందంటే చాలు.. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఇంటి నుంచి కాసేపు అలా బయటకొచ్చి ఆనందంగా.. ఆహ్లాదంగా గడపాలనుకుంటారు. ఇక వేసవి సెలవుల్లో చిన్నారులు చేసే సందడి.. అంతా ఇంతా కాదు. పిల్లల ఆటపాటలతో పార్కులు, ఖాళీ స్థలాలన్నీ కళకళలాడుతుంటాయి. పెద్దల ఆరోగ్యం, యువత, చిన్నారులను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్కులు, గ్రీన్‌బెల్ట్‌ల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ప్రతి వార్డులో పార్కులను అభివృద్ధి చేశారు. జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతున్నాయి.

ఆహ్లాదకరమైన వాతావరణంలో..

పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో 50, 51, 53 వార్డుల్లోని పార్కుల్లో సందడి నెలకొంది. చిన్నారులు ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి దాదాపు రాత్రి 7, 8 గంటల వరకు వాటిల్లో ఆటలాడుతూ ఆనందంలో మునిగిపోతున్నారు. అమ్మమ్మ, తాతయ్యల ఇళ్లకు వచ్చేవారు కూడా చిన్నారులతో స్నేహం చేసి ఎంజాయ్ చేస్తున్నారు. 51వ వార్డు కళింగనగర్‌లోని ఈస్ట్ పార్కులో నిత్యం వాకింగ్, వ్యాయామాలు చేస్తుంటారు. ఈ సమ్మర్‌లో మరింత రద్దీ పెరిగి పిల్లల సందడి ఎక్కువైంది. 53వ వార్డు ఎఫ్‌సీఐ నగర్ పార్కులో సందడి వాతావరణం నెలకొంది. ఇటీవల అభివృద్ధి చేసిన ఈ ఉద్యానవనంలో సమయం గడిపేందుకు చుట్టుపక్కల నివాసులు, చిన్నారులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. 50వ వార్డు బృందావన్ పార్కులో పిల్లలు, పెద్దలు సరదాగా గడుపుతున్నారు. వ్యాయామాలు, జాగింగ్, వాకింగ్ చేసే వారందరూ సాయంత్రమైతే ఇక్కడ ఒకే చోట దర్శనమిస్తారు. వృద్ధులు, మరీ ముఖ్యంగా మహిళలు పార్కుకు వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో కాసేపు గడుపుతూ ముచ్చటించుకుంటున్నారు. ప్రభుత్వం, జీవీఎంసీ కల్పించిన సౌకర్యాలతో ఈ వేసవి సెలవల్లో చిన్నారులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు.



51వ వార్డు కళింగనగర్ ఈస్ట్ పార్కులో పిల్లల సందడి

పార్కులో ఆడుకోవడం బాగుంది



కళింగనగర్ ఈస్ట్ పార్కులో ఆడుకోవడం చాలా బాగుంది. మేం బెంగుళూరులో ఉంటాం. నానమ్మ ఇంటికి వచ్చాం. వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తున్నాం. రోజూ సాయంత్రం పార్కుకు వచ్చి రాత్రి వరకు ఉంటాం.

– పరిణీత, కళింగనర్

ఎంజాయ్ చేస్తున్నాం



వేసవి సెలవుల్లో ఎఫ్‌సీఐ నగర్ పార్కులో బాగా ఎంజాయ్ చేస్తున్నాం. ఇక్కడ జిమ్‌లు ఏర్పాటు చేశారు. పిల్లలకు ఆడుకునేందుకు వీలుగా ఊయలలు, జారుడు బల్లలు, ఇలా ఎన్నో ఆట పరికరాలు ఉండడం బాగుంది.

– జెస్సిక, ఎఫ్‌సీఐ నగర్

అన్ని పరికరాలు ఉన్నాయి



గరివిడి హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. వేసవి సెలవులకు ఇక్కడికి వచ్చాను. కళింగనగర్ పార్కు చాలా బాగుంది. అన్ని రకాల వ్యాయామ, ఆడుకునే పరికరాలు ఉన్నాయి. రాత్రి వరకు ఇక్కడే ఆడుకుని వెళ్తుంటాను.

– మోహిత్, కళింగనగర్

పోర్టు ఉద్యోగుల సమస్యలపై వినతి



పోర్టు చైర్మన్ అంగముత్తును సత్కరిస్తున్న మాజీ ట్రస్టీ మళ్ల వెంకటరావు

సీతంపేట: విశాఖపట్నం పోర్టు అథారిటీ కొత్త చైర్మన్ అంగముత్తును బుధవారం పోర్టు అథారిటీ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కందాల ప్రభాకరరావు, మాజీ పోర్టు ట్రస్టీ మళ్ల వెంకటరావులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, పెన్షనర్లు, కలాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయన వినతిపత్రం అందజేశారు. 2020 నుంచి కొంత మందికి ఆపేసిన విడో పెన్షన్‌ను పునరుద్ధరించాలని, 25 ఏళ్ల నుంచి పూల్ కలాసీలుగా పనిచేస్తున్న వారికి అర్హత కలిగిన శాశ్వత ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, టైం స్కేల్ అమలు చేయాలని, శాశ్వత ఉద్యోగుల మాదిరిగా బోనస్ ప్రకటించాలని, గుండు అప్పలరాజు అనే విశ్రాంత ఉద్యోగి తాలూకా పెండింగ్‌లో ఉన్న పే ఫిక్సేషన్ ఏరియర్స్ చెల్లింపు సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. చైర్మన్ స్పందిస్తూ సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పూల్ కలాసీల నాయకులు శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

చిరువ్యాపారికి ఆర్థిక సాయం



లక్ష్మికి నగదు అందిస్తున్న రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్ పార్కు ఎదురుగా ఉన్న చిరువ్యాపారికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ చిరువ్యాపారి లక్ష్మి కొంతకాలంగా కూరగాయల దుకాణం నడుపుకుంటున్నారు. రెండు రోజుల కిందట ఈ దుకాణం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వెంకటరమణ బుధవారం ఆమెను పరామర్శించి, రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సంస్థలు లక్ష్మికి సాయం చేయాలని కోరారు. దుకాణం తగులబెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎయిర్‌పోర్టు స్టేషన్ సీఐ బి.ఎం.డి.ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పప్పల లక్ష్మణ్, కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు డీడీల అందజేత



డీడీలు అందజేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, సీవో ధనలక్ష్మి

తాటిచెట్లపాలెం: టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల కోసం చెల్లించిన రూ.25 వేల డీడీలను లబ్ధిదారులకు తిరిగి అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన లబ్ధిదారులకు ఒక్క రూపాయికే టిడ్కో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని హామీ ఇవ్వడంతో జీవీఎంసీ 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి జీవీఎంసీ అధికారులతో మాట్లాడి వారు కట్టిన డీడీలు తిరిగి ఇప్పించారు. వార్డు పరిధిలో డీడీలు కట్టిన లబ్ధిదారులకు సీవో ధనలక్ష్మి సమక్షంలో బుధవారం అందించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లు ఇస్తామని మోసం చేసినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీతో తమ డీడీలు తిరిగి ఇవ్వడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేసారు. స్థానిక వలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతకు ట్రోఫీ బహూకరణ



ట్రోఫీ అందిస్తున్న కూన రవికుమార్, వరప్రసాద్

మురళీనగర్: ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఇటీవల ఎన్టీఆర్ క్రికెట్ కప్ పోటీలు నిర్వహించారు. మురళీనగర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో విజేతలకు మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్, సనపల వరప్రసాద్ ట్రోఫీ బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నంత వరకు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ బతికే ఉంటారన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి చిక్కాల విజయ్‌బాబు ప్రసంగించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఏయూ ఆచార్యులు

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీలోని కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిని వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ సమత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ప్రొఫెసర్ ఎస్.వి.నాయుడు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ–మొబిలిటీ, మోడలింగ్ అండ్ కంట్రోల్ ఆఫ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఆర్.పద్మశ్రీ, సైంటిస్ట్ శ్రీనివాస్ కుమార్, ప్రొఫెసర్ శేషగిరిరావు, ప్రొఫెసర్ ఎం.వి.వి.చందన లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధిలోని కప్పరాడ, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్‌–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతినగర్, జయప్రకాష్‌నగర్, బాపూజీనగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, అప్పర జయప్రకాష్‌నగర్ కప్పరాడ, రాంజీ ఎస్టేట్స్, కొత్తూరు, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, సిద్ధార్థనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

నేటి నుంచి ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవాలు



టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. గురువారం కల్యాణరాట మహోత్సవం చేపట్టనున్నట్లు వివరించారు. 2వ తేదీ ఉదయం 7 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షా వస్త్రధారణ, కంకణధారణ, మండపారాధన, ధ్వజారోహణ ఉంటాయన్నారు. 3న స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేరోజు సాయంత్రం ఉత్సవ విగ్రహాల తిరువీధి ఉత్సవం అనంతరం దివ్య కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతానికి సహకారం



తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఆరిలోవ: జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పి.ఎం.బాలాజీ బుధవారం ఆంధ్రా యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వారు సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. ఏయూలో నిర్వహిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సుల గురించి చర్చించారు. ఈ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా తగిన సహకారం అందించాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీని కోరారు. ఈ మేరకు స్పందించిన బాలాజీ మాట్లాడుతూ జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జపనీస్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీ సెంటర్ డైరెక్టర్, ఫారిన్, లింగ్విస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, నన్నయ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలపై డీఎంహెచ్‌వో ఆరా

సాక్షి ఎఫెక్ట్..



ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

కంచరపాలెం: జీవీఎంసీ 46, 47 వార్డులకు చెందిన కప్పరాడ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుబాబులు, ఆకతాయిల ఆగడాలతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై 'ఆరోగ్య కేంద్రంలో ఆకతాయిల ఆగడాలు' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తక్షణం స్పందించి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో అక్రమ పార్కింగ్‌తోపాటు ఆకతాయిలు నిత్యం చెలరేగిపోతున్నారని, మందుబాబులు, గంజాయి సేవించే వారితో విధులు నిర్వహించడం ఆందోళనగా ఉంటోందని ఆయన వద్ద సిబ్బంది వాపోయారు. ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సనపల రాజేంద్రనను డీఎంహెచ్‌వో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం క్రైం పోలీసులకు ఫోన్ ద్వారా ఈ సమస్యను వివరించి పెట్రోలింగ్ సిబ్బందిని గస్తీగా ఏర్పాటు చేయాలని జగదీశ్వరరావు కోరారు. ప్రోగాం అధికారులు డాక్టర్ రమారెడ్డి, డాక్టర్ ఉమావతి, డాక్టర్ నాగభూషన్ పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణకు స్వర నివాళి



కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయనీ గాయకులు, కళాకారులు

సీతంపేట: పల్లవి మ్యూజిక్ సినీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు సూపర్ స్టార్ కృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి అలరించారు. దివంగత సినీ దిగ్గజం కృష్ణ జయంతిని పురస్కరించుకుని పల్ల బాబ్జి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమాన్ని కళాకారులు సన్‌మూర్తి, వెంకటేష్ మాస్టారు, బాబ్జి, హారిక, ఖాన్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాయనీ గాయకులు భాగ్యలక్ష్మి, సి.వి.రాజేశ్వరి, శైలజ, మాధురి, కల్యాణి, అమ్మాజీరావు, మహమ్మద్ ఖాన్, నాగేశ్వరరావు, వెంకట్ నాయుడు, మను పల్ల, రాధారాణి హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను రంజింపజేశారు.

ధూమపానం హానికరం



మాట్లాడుతున్న ఆచార్య ఉమామహేశ్వరరావు

సీతంపేట: ఆరోగ్యానికి హానికరమైన ధూమపానం నిషేధంపై ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినోత్సవం ఒక్కరోజు కాకుండా నిరంతరం పాటించాలని సూచించారు. తద్వారా తమ ఆరోగ్యంతోపాటు ఎదుటి వారు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. డాక్టర్ కె.శ్రీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తే ధూమపాన నిషేధం సాధ్యమవుతుందన్నారు. బ్యాంకు పీఆర్వో జి.ఎస్. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు బి.నాగేశ్వరరావు, ఎస్.ఆంజనేయులు, సీఈవో శ్యామ్‌కిషోర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

మహారాణిపేట: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ మీదుగా తిరిగి కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ పొగాకు వినియోగం ఒక జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని.. అందుకే భారత ప్రభుత్వం పొగాకును కొన్ని బహిరంగ ప్రదేశాల్లో వినియోగించడం నిషేధించిందన్నారు. ప్రతీ ఏటా పొగాకు, ధూమపానం చేయడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించేందుకు మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటామన్నారు. దీన్ని వినియోగాన్ని తగ్గించుకుంటూ పోవడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందని డీఎంహెచ్‌వో అన్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో ప్రకటనల రూపంలో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. భావితరాలకు ఎలాంటి నష్టాలు జరుగుతాయో ప్రభుత్వాలు ప్రజలకు తెలియచేస్తున్నాయన్నారు. ఎన్‌జీవోలు, రైతులు, యువత, విద్యార్థులు అందరు పాల్గొని పొగాకు రహిత భారత దేశ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యుడు రమారెడ్డి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలతో నిండిన కాలువలు



జీవీకే ప్లాజా ఎదురుగా ఉన్న రహదారిలో డ్రెయిన్ దుస్థితి



మెయిన్ రోడ్‌లోని కాలువలో నిలిచిపోయిన మురుగు నీరు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ప్రధాన రహదారుల్లో సైతం కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. తరచూ మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. డ్రెయిన్లలో వ్యర్థాలు, సిల్ట్ సక్రమంగా తొలగించడం లేదని తెలుస్తోంది. సీతంపేట మెయిన్ రోడ్‌లో జీవీకే ప్లాజా ఎదురుగా ఉన్న కాలువ వ్యర్థాలతో నిండింది. అనుబంధ రహదారి నుంచి మెయిన్ రోడ్‌లోని ప్రధాన డ్రెయిన్‌లో కూడా మురుగు నీటి ప్రవాహానికి మార్గం లేకుండా పోయింది. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీ పర్యవేక్షణా లోపంతోనే పారిశుధ్యం అధ్వానంగా తయారైందని స్థానికులు చెబుతున్నారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మెరుగైన పారిశుధ్యం కోసం తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.